

# జలనిధిలో అమృతకలశం

కెప్టెన్ షేక్ మౌలాలీ

2—50' అన్నారు. అప్పట్లో ప్లేటు భోజనం అంటే నాకు అర్థం కాలేదు.

"చిన్న పిల్లవాడు కదా! నెలసరి టిక్కెట్లు ఎంత?" అన్నాడు పంతులు.

"చిన్నా పెద్దా సమస్య కాదండీ! ఒకటే రేటు నెలసరి అయితే అరవై టిక్కెట్లు మాటవరకై రూపాయలు. టిక్కెట్లు రెడీగా ఉన్నాయి". డబ్బిస్తే ఇస్తానన్నాడు.

పంతులు మారు మాటాడలేదు. ఇద్దరం నడుస్తున్నాం. దారి వెంట కొన్ని 'స్టూడెంటు మెస్సులు' దర్శన మిచ్చాయి.

బహుశా ఇక్కడ రేటు తక్కువ ఉంటుందని భ్రమించి ఒక చోట విచారించాడు పంతులు.

"ఇక్కడకూడా హోటలు ధరే! అయితే పదార్థాలు బాగుంటాయి. మరో మాట ఏమంటే, విద్యార్థులకు హోటలులో స్వేచ్ఛ ఉండదు. నోరు మూసుకుని భోజనం చేసి రావాలి. కాని ఈ మెస్సులలో విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉంటాయి. తమ సొంత ఇంటి లాగా వ్యవహరించవచ్చును" అన్నారు.

మరి ఏ మెస్‌లోకి తొంగి చూడలేదు మేము. జులై నెల అది. ఒంటి గంట కావస్తాంది. గ్రీష్మతాపం తగ్గలేదు. రోడ్లన్నీ గంధకపు ధూళితో నిండి ఉన్నాయి. కొండ పక్కన నడిచి ఒక కిళ్ళీ కొట్టు దగ్గర 'అమ్మ' ఇంటిని వాకబు చేశాం.

"అదిగో, రెండో వీధిలో చివరి ఇల్లు!" అన్నాడతను.

రెండు గదుల బంగళా పెంకుటిల్లు అది. ముందు వైపు తాటాకుల పందిరి దించి ఉంది.

"రండి! రండి!" సాదరమైన పిలుపు వచ్చింది. తలెత్తి చూశాను. దాదాపు యాభై ఏళ్ళు నిండిన స్త్రీ స్మిత వదనంతో నిలబడి ఉంది.

"ఈమేనేమో! 'అమ్మ' అంటే" అన్నాడు పంతులు. నేను మాట్లాడలేదు.

వసారాలోకి వెళ్ళాం. అలసట మా ముఖాల్లో ప్రస్ఫుట మవుతూంది.

"అదిగో బావి దగ్గర బొక్కెన ఉంది. కాళ్ళు కడుక్కుని రండి!" అందామె.

ముఖాలు కడుక్కుని వచ్చాం.

'లోపలకు రండి!" లోపలించి పిలిచింది.

ఆకుల్లో భోజనం వడ్డించి ఉంది. తృప్తిగా తిన్నాం. విందు భోజనాన్ని మించి ఉంది.

బయటకు వచ్చేసరికి వసారాలో రెండు మంచాలు వాల్చి ఉన్నాయి.

"కాస్సేపు పడుకోండి!" అంది.

మాపు బస్సు టైము కావచ్చింది. అప్పుడు వెళ్ళక పోతే తిరిగి రాత్రి ఎనిమిది గంటలకే. పేరుకు పూరి కొంప బస్సు. కాని అవి పూరి బస్సులు. ఎప్పుడు ఎక్కడ గాండ్రించి ఎదురు తిరుగుతాయో తెలీదు. అర్ధరాత్రి రోడ్డు మీద జాతర చేసుకోవాలి.

పంతులు ఏమీ మాట్లాడకుండా నడుం వాల్చాడు అరక్షణంలో గురక మొదలయింది.

నాకు నిద్ర పట్టలేదు. మాక్సిమ్ గోర్కీ వ్రాసిన 'అమ్మ' తెలుగు అనువాదం చదువుతున్నాను. ఆ రోజే పంతులు నా చేత కొనిపించాడు.

"నీ పేరేమిటి నాయనా?" అందామె. ఆ గొంతలో ఏదో ఆత్మీయత, మార్దవం కూడుకొని ఉన్నాయి.

"సీత!" అన్నాను.


కొంచెం విస్మయంగా చూసింది ఆమె నావంక. నాకు ఇదేమీ కొత్త కాదు. నా పేరు మొదటిసారిగా విన్నవా రందరూ ఆశ్చర్యంగా నా వైపు చూస్తారు.

"మా అమ్మ, నాన్నలకు లేకలేక కలిగిన ఒక్కగా ఒక్కడ్ని. మా అమ్మకు వాళ్ళ అమ్మ అంటే ప్రేమ. మా నాన్నకు వాళ్ళ నాన్న అంటే ఇష్టం. ఇద్దరి పేర్లు కలిసి వచ్చేట్లు నాకు 'సీతారాముడు' అని పేరు పెట్టారు" అన్నాను.

"మరి 'సీత' అని చెప్పుకుంటున్నావుగా!" కుతూహలంగా అడిగింది.

"నాకు మా అమ్మ అంటే ఎక్కువ ఇష్టం. ఆమెకు ఇష్టమైన పేరును 'సీత'గా చెప్పుకుంటాను. నాన్నంటే కూడా ఇష్టమే!" అన్నాను.

ఆమె ముఖంలో చిరునవ్వు కానవచ్చింది.




మూడున్నర గంట అయింది. కొంచెం చల్లబడింది. పంతులు నిద్రలేచి ఆవలించాడు. చెరి రెండు అట్లు తెచ్చింది. తిన్నాం. చెరో గ్లాసెడు మజ్జిగ సేవించాం.

"అబ్బాయి ఎప్పటి నుండి వస్తాడండీ!" అడిగింది.

"ఈ రోజే ఫీజు కట్టాం. వచ్చే సోమవారం నుండి ఇక్కడే ఉంటాడు" పంతులు చెప్పాడు.

"ఎవరైనా తెలిసినవారుంటే సరే! లేకుంటే ఇక్కడే ఉండవచ్చు." ఆప్యాయతతో అంది.

పంతులు జేబులోంచి పది రూపాయల నోటు తీసి ఇవ్వబోయాడు.

ఆమె తీసుకోకుండా "ఎందుకు?" అని అడిగింది.

"మధ్యాహ్నం మా భోజనం!" అన్నాడు.

"ఫరవాలే" దంటూ నవ్వింది.

పది రూపాయలు జేబులో పెట్టుకొని రెండు వంద రూపాయల నోట్లు తీశాడు పంతులు. ఆమె అడగకుండానే "అడ్వాన్సు" అన్నాడు.

"తర్వాత చూద్దాం! సోమవారం వస్తాడుగా" అంది. తిరిగి అదే నవ్వు.

పంతులు ఏమీ అర్థం కాక ఆమెవైపు తదేకంగా చూస్తున్నాడు. నా కిదంతా ఒక వింతగా ఉంది.

రాత్రి ఎనిమిది గంటల బస్సులో ఇల్లు చేరాం. ఎక్కడా అది పొంగ్రడ పెట్టకుండా ఇల్లు చేరింది.

ఆదివారం సాయం సమయం అయ్యేసరికి నాకు తలనొప్పి, జ్వరం వచ్చింది. పెద్దగా ఇబ్బంది పెట్టకపోయినా నాలుగు రోజుల వరకు తగ్గలేదు.

శుక్రవారం ఉదయం ఒక చిన్న ట్రంకులో బట్టలు, పుస్తకాలు సర్దుకొని బయలుదేరాను.

కొత్త ప్రదేశంలో ఒంటరిగా ఉండాలంటే ఏదో వెలితిగా ఉంది. అమ్మ కొన్ని అరిసెలు, సున్ని ఉండలు డబ్బాలో పెట్టి "రోజూ రెండు తిను" అంది.

బస్సు దిగి ట్రంకు నెత్తిన పెట్టుకున్నాను దారిన పోయే వారు నా వైపు అదోలా చూస్తున్నారు. కొందరైతే నవ్వుతున్నారు.

తర్వాత తెలిసింది, ట్రంకు నెత్తిన పెట్టుకొని టవునులో నడవటం సభ్యత కాదని. సభ్యత పేరుతో మోయ గలిగిన వస్తువుకి, నడువ గలిగిన దూరానికి కూడా రిక్షాలో వెళతారని నాకు తర్వాత తెలిసింది.

రంగారాయుడి చెరువు మూల తిరిగాను. ఎక్కడ చూసిందో, ఎదురు వచ్చి ట్రంకు అందుకుంది.

"నేను తెస్తాను" అన్నాను.

వద్దని లాక్కుని తనే తెచ్చింది.

"సోమవారం నుండి నీ కోసం ఎదురు చూస్తున్నాను" అంది. మా సొంత అమ్మ అన్నట్లుంది ఆ మాటలు.

జ్వరం మూలాన రాలేక పోయానని చెప్పాను. ఆమె ముఖంలో కొంచెం బాధ కానవచ్చింది.

తొమ్మిది గంట అయింది. సుమారు పాతిక, ముప్పయి మంది యువకులు ఒరబిరా వచ్చారు. అంతా దాదాపు నా వయసు వారే! వారిలో ఒకరు ఆకులు వరిస్తే, మరొకరు గ్లాసుల్లో నీళ్ళు పెట్టారు. అచేతనంగా నేనూ కాళ్ళు కడుక్కొని వారి ప్రక్కన కూర్చున్నాను. ఆమె వడ్డించటం మొదలు పెట్టింది. అంతా ఆమెను 'అమ్మ'ని అని సంబోధిస్తున్నారు. నా నోట కూడా అప్రయత్నంగా 'అమ్మ' అని వెలువడింది.

భోజనం అయిన తరవాత కాలేజీకి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి వేడి వేడి పకోడీలు ఎదురు చూస్తున్నాయి. తిని మజ్జిగ తాగాను. అరగంట వ్యవధిలో మిగతా పిల్లలు కూడా వచ్చి తిని వెళ్ళారు.

కొత్త ప్రదేశం అయినప్పటికి నా కెందుకో 'కొత్త' అనిపించలేదు. బిడియం కూడా తగ్గింది. సాయంకాలం ఆరున్నర అయ్యేసరికి తిరిగి భోజనాలు ముగించాం. మిగతా వారు వారి వారి రూములకు వెళ్ళారు. నేను అక్కడే వసారాలో మంచం వాల్చుకుని కూర్చున్నాను. ఆ రోజు కొత్తగా కొన్న పుస్తకాలకు అట్టలు వేసుకోవటం, టైమ్ టేబిలు ప్రకారం నోట్సులు కుట్టుకోవటంతో సరిపోయింది.

ఒక వారం గడిచే సరికి 'అమ్మ' వాతావరణం నాకు కొంత వరకు తెలియ వచ్చింది. దాదాపు అరొక పొష్టలు ( కాదని చివరకు నేనే తెలుసుకున్నాను. ) బాగా మార్కులు వచ్చిన వారికే అక్కడ ప్రవేశం. ప్రతి రోజు తొమ్మిది గంటలకు భోజనం. సాయంత్రం కాలేజీ నుండి రాగానే తిన్నంత టిఫిను. తిరిగి ఆరున్నరకు భోజనం. ప్రతి ఆదివారం తలంటి పోసుకోవలసిందే! ఆ రోజు భోజనం సమయం పదకొండు గంటలకు. ఎవరైనా తలంటు కోనట్లు కనిపిస్తే 'అమ్మ' అతన్ని అప్పుడే బావి దగ్గర కూర్చోపెట్టి స్నానం చేయిస్తుంది. ఆ తర్వాతే భోజనం.

సినిమా చూడాలంటే 'అమ్మ'తో చెప్పాలి. కాదనదు. ప్రతి టెరమ్ ప్రోగ్రెస్ కార్డు చూపాలి. మార్కులు తగ్గితే అక్కడ ఇక లాభం లేదు. చాలా నిక్కచ్చిగా ఉంటుంది. భోజనం వేరేచోట ఏర్పాటు చేసుకో మంటుంది. అందుకే షోకీలా రాయుళ్ళను ఆమె దరికి చేరనీయదు. ఆ క్రమశిక్షణ కోరుకొని తట్టుకొనే వారే అక్కడకు వస్తారు.

పది రోజులు గడిచాయి. పక్కన చిన్న గంజాం నుండి ఒక విద్యార్థి తండ్రి వచ్చాడు. వస్తూ ఒక బస్తా బియ్యం తెచ్చాడు. మరో నాలుగు రోజులు గడిచాయి. మరో వూరు నుండి కొంచెం నెయ్యి కందిపప్పు వచ్చాయి.

ఒక నెల గడిచింది. అక్కడి వాతావరణం నాకు మరి కొంత అర్థమయింది. 'అమ్మ' ఎవరినీ ఏమీ అడగదు. ఆమె ఆశించేది క్రమ శిక్షణతో కూడు కున్న విద్య మాత్రమే! ఎవరైనా వస్తు రూపంలో తెస్తే చూస్తూ ఉంటుంది. తేవాలని నియమం లేదు. ప్రతి పిల్లవాడిని తన సొంత కుమారునిలాగా చూసుకుంటుంది. ఎక్కువగా మాట్లాడదు. ఎవరు ఏమి తెచ్చినా తను పెట్టే ఖర్చులో ఏ మార్పూ రాదు. తను, వంట మనిషి కలిసి అన్ని పనులు చేస్తుంటారు. నీళ్ళు తోడటానికి, అంట్లకు మరో పని మనిషి ఉంది.

'అమ్మ' స్వయంగా బియ్యం, పప్పులు, కూరలు — అన్నీ తెస్తుంది. ఆమెకు అంత డబ్బు ఎక్కడ నుండి వస్తుందో ఎవరికీ తెలీదు. ఎంత కలా చేస్తుందో అర్థం కాదు.

దసరా సెలవులు వచ్చాయి. మా ఇంటికి వెళ్ళాను. అమ్మ నా పెట్టె తెరిచి బట్టలు సర్దుతూ "ఒరే, సీతా, ఇలా రా!" అని పిలిచింది.

డబ్బా తెరిచి నా ముందు ఉంచింది. మూడు నెలల నాడు నేను ఒంగోలు వెళ్ళేటప్పుడు రోజూ తినమని ఇచ్చిన అరిసెలు, సున్ని ఉండలు బూజుపట్టి వాసన వేస్తున్నాయి.

నిర్ఘాంతపోయాను.

"బాగాలేవా ఏమిటి? ఎందుకు తినలేదు?" అడిగింది.

సమాధానం ఏం చెప్పాలో అర్థం కాలేదు. అక్కడ 'అమ్మ' పోషణ అలా ఉంది. ఈ అమ్మ సంగతి, పూర్తిగా మరిచిపోయాను. ఇక ఆ డబ్బా సంగతి సరేసరి!

ఆ విషయమే చెప్పాను. అమ్మ మొదట నమ్మలేదు. నాలుగు రోజుల తర్వాత 'అమ్మ'ను గూర్చి విగిలిన విషయాలు కూడా చెప్పాను. ఆశ్చర్యంతో

పాటు ఆనందం ఆమెలో తొంగిచూడటం గమనించాను. ఆ తర్వాత మరెప్పుడూ అమ్మ నాకు పిండి వంటల డబ్బాలు ఇవ్వలేదు. ఈ సారి ఒక చిన్న డబ్బాలో నెయ్యి నింపి ఇచ్చింది.

రెండు సంవత్సరాలు గడిచాయి. ఇంటర్మీడియట్‌లో చాలా మంచి మార్కులు వచ్చాయి. తిరిగి బి. ఎస్‌సి. లో చేరాను. మంచి ఫలితం చేకూరింది.

'అమ్మ' పోషణలో అయిదేళ్ళు అయిదు క్షణాలుగా గడిచాయి. మొదట అరలాగులో వచ్చిన వాడిని ఇప్పుడు అన్ని విధాలా ఎదిగి నివసించింది.

ఈ అయిదు సంవత్సరాల కాలంలో నేను 'అమ్మ'కు ఇచ్చింది ఏమీ లేదని చెప్పాలి. మొదటి సంవత్సరం రెండుసార్లు నెయ్యి, కందిపప్పు తెచ్చాను. రెండవ సంవత్సరం రెండు మూటల బియ్యం తెచ్చి పడేశాను. ఆ తర్వాత సంవత్సరం వర్షాలు లేక పంటలు సరిగా పండలేదు. అప్పులు పెరిగాయి. ఆ అప్పులుతీరటానికి పొగాకు నాటాడు నాన్న. ధర రాక దానిమీద నష్టం వచ్చింది. అదంతా తీరటానికి తిరిగి పత్తి నాటాడు. నోటిదగ్గర కొచ్చిన పంట తుఫాను పాలయింది. కనుక నేను 'అమ్మ'కు ఏమీ ఇవ్వలేదనే చెప్పాలి.

అయితే ఈ విషయాన్ని ఆమెకు తెలుసో, తెలియదో నేను చెప్పలేను. డబ్బు ప్రస్తావన అసలు ఎత్తదు. ఆమెలో ఒక అలౌకిక మందహాసం కనుపిస్తుంది.

నాకు అయిదేళ్ళూ ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇచ్చింది. 'అమ్మ'కు ఇవ్వబోయాను. "నువ్వే ఉంచుకో" అంది. కొంత నా బట్టలకు, ఇతర ఖర్చులకు వాడుకొని మిగిలింది నాన్న కిచ్చాను. ఈసారి కూడా స్కాలర్‌షిప్ రావచ్చు అనే నమ్మకంతో బయలుదేరాను. కాని అక్కడ విశాఖపట్నంలో నన్ను ఆదరించటానికి 'అమ్మ'లు దొరకరు. అవసరమైతే మరి కొంత అప్పు చేద్దామన్నాడు నాన్న.

సామానుతో సహా 'అమ్మ' దగ్గరకు వెళ్ళాను. ఆమె నా వైపు ఎందుకో తృప్తిగా చూసింది. విశాఖపట్నం విషయం చెప్పాను. ఆమెకు ముందే తెలిసినట్లు నవ్వింది. ఆ నవ్వులో ఎంతో ఆర్ద్రత ఉంది.

"ఏ బండికి వెళుతున్నావు, సీతా!" అంది.

"రాత్రికి" అన్నాను.

రెండు, మూడు సంవత్సరాల నుండి నా మదిలో ఓ ప్రశ్న అలలెత్తేది. తగిన సందర్భం దొరకక పూరుకున్నాను.

"అమ్మా!" అన్నాను.

ఏమిటన్నట్లు నా వైపు చూసింది.

నేను మవునంగా ఆమె వైపు చూస్తున్నాను.


ఏదో విశేష ముందని పూహించి మంచం మీద నా ప్రక్కన కూర్చుంది

"మరి!" అన్నాను.

"మరి?" ఎదురు ప్రశ్నించింది.

మవునం వహించాను.

"ఏమిటి? చెప్పు, సీతా! ఏదైనా డబ్బుకు ఇబ్బంది పడితే ఉత్తరం వ్రాయి. పంపుతాను. సంకోచించవద్దు" అంది.




అప్పు డామె నాకు 'జగజ్జనని' అనిపించింది.

"డబ్బు విషయం కాదు" అన్నాను.

"అయితే మరి ఏమిటి?" కొంచెం ఆతురతగా అడిగింది.

"నువ్వు ఎవరినుండీ ఏమీ తీసుకోవు కదా! మరి ఈ డబ్బంతా ఎక్కడిది? ఎందు కిలా ఖర్చు చేస్తున్నావు?" అని అడిగాను.

ఓ క్షణం ఆమె ముఖంలో గంభీరత ఆవహించింది. "అదో పెద్ద కథ" అంది నిట్టూరుస్తూ...

"నే వినకూడదా?" తిరిగి ప్రశ్న వేశాను.

"నీవేకాదు, సీతా, మరెవ్వరైనా కూడా వినవచ్చును" అంది.

నేను తిరిగి మాట్లాడలేదు. ఆమె ముఖంలో ఎంతో ప్రశాంతత చోటు చేసుకుంది. చెప్ప నారంభించింది.

"కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు గ్రామంలో 1934వ సంవత్సరంలో పుట్టాను. మాది సంపన్నమైన కుటుంబం. సంస్కారం మాకు వంశానుగతంగా సంక్రమించిన పెన్నిధి ...

ఆ రోజుల్లో స్త్రీలు పెద్దగా చదువుకోలేదు. కాని విద్యావంతులు."

నా ముఖంలో కదలికలు గమనించి 'అమ్మ' వివరించింది.

"చదువు అంటే జీవనోపాధికి పనికివచ్చే డిగ్రీలు అని ఈ నాడు చాలా మంది అంటున్నారు. ఆ నాడు డిగ్రీలు పెద్దగా లేవు. కాని ప్రతి ఇంట నిత్యం గీతా పారాయణం, భాగవత పురాణం జరుగుతుండేవి. రామాయణ, భారతాల ప్రధాన ఘట్టాలను హరికథ, బుర్రకథ, వీధి నాటకాలుగా ప్రదర్శించేవారు. వీని వలన మానవ జీవితం ఒక సక్రమ పంథాలో వెళ్ళగలిగేది. ఆనాడు మైకులు లేవు. పురాణ కాలక్షేపాలు ఎక్కువగా ఆతురూపంలో ఉండేవి.

మా అమ్మమ్మ ప్రతి రోజూ రామాలయంలో పురాణం చెప్పేది. ఆమెకు తెలియని ధర్మాలు లేవనే వారు అంతా. 'శబరి' అని పిల్చేవారు. ఆమె ఎక్కడుంటే అక్కడే గుడి అనేంత మంది భక్తజనం ఆమెచుట్టూ మూగేవారు.

పురాణం ముగిసిన తర్వాత చాలా మంది ఏవేవో ప్రశ్నలు వేసి తమ తమ అనుమానాలు తీర్చుకునేవారు. అప్పు డామెకు డెబ్బయి అయిదు సంవత్సరాలు. ఆమె శరీరం ఎండిపోయి 'యజ్ఞకుండం' లో వేసే సమిధల రూపం పొందింది. నడుము 'ధనుస్సు' లాగా వంగి, తల 'ముగ్గుబుట్ట' అయిపోయింది."

నేను రెప్ప వాల్చకుండా 'అమ్మ'వైపు తదేకంగా చూస్తున్నాను.

"కథ బావుందా ... చెప్పనా!" అంది మధ్యలో ఆపి.

నా కెందుకో కుతూహలంగా ఉంది.

"చాలా బావుందమ్మా! ఆపకుండా చెప్పు" అన్నాను.

తిరిగి మొదలుపెట్టింది ...

"నా కప్పుడు పదే ళ్ళుంటాయి. అమ్మమ్మకు తోడుగా గుడి కెళ్ళే దానిని. పురాణం వింటుండేదానిని.

మొదట్లో నా కంతగా అర్థమయ్యేది కాదు.

ప్రతి రోజు ఆరు గంటలకు గీతా పారాయణం జరిగేది. ఆ తర్వాత భాగవతంలో ఘట్టాలు వరుసగా చెబుతూ ఉండేది. ఒక్కొ విషయాన్ని గురించి వివరంగా చెప్పేది.

మెల్లమెల్లగా నాకు కూడా కొంత అర్థం అవుతుండేది.

ఒకరోజు పురాణంలో రాముడికి, కృష్ణుడికి తేడా ఏమిటని అడిగారు.

అమ్మమ్మ చెప్పింది — 'రాముడు పరిపూర్ణావతారం మానవమాత్రుడిగా అనుష్ఠించి చూపాడు. కృష్ణుడు పరిపూర్ణతమావతారం. విశ్వరూపంతోనే అవతరిస్తాడు. ఎక్కడా దేనికీ అంటడు. చిన్మయ స్వరూపుడుగానే వ్యవహరిస్తాడు. 'ఆనందం బ్రహ్మణో విద్వాన్' సూక్తి కృష్ణ తత్వాన్ని చాటి చెప్తుంది.



అమ్మమ్మ ఇంకా ఏవేవో చెప్పింది. అదంతా ఇప్పుడు నాకు సరిగా జ్ఞాపకం లేదు.

అమ్మమ్మ ఎనభైలో పడింది. ఒక రోజు గుడి నుండి ఆమెను పట్టుకొని నడిపిస్తూ 'వాల్మీకికి, వ్యాసుల వారికి తేడా ఏమిట'ని అడిగాను.

అమ్మమ్మ చాలా సులువుగా వివరించింది— 'ఇద్దరూ చెప్పింది ఒకటే. ఒకే విషయాన్ని క్లుప్తంగా బీజరూపంలో చెప్పిన వాడు వాల్మీకి అయితే, విశదీకరించిన వాడు వ్యాస మహర్షి. వారి పేర్లు తమ తమ కర్తవ్యాలకు సంకేతంగా నిలిచి ఉన్నాయి. ఏదైనా మహా సందేశాన్ని లోకానికి అందజేసే సమయంలో 'పురా వాల్మీకి నా గీతం' అంటాడు వ్యాసుడు. ఆత్మ, పరమాత్మల రసమయ క్రీడలను భాగవతంగా సృష్టించాడాయన. భాగవతం చదువుతుంటే మామూలు కథల లాగుంటాయి. కాని మేధావులంతా 'విద్యావతాం భాగవతే పరీక్షా' అంటారు. చదువులలో సారమెల్ల భాగవతంలోనే ఉంది."

దివి సీమలో 'హంసల దీవి' అనే గ్రామం ఉంది. కృష్ణవేణి సాగరముల సంగమ దృశ్యం ఎంతో మనోహరంగా ఉంటుంది. అక్కడ ఒక కమనీయ కుటుంబంలో నా పదహారో ఏట కాలుపెట్టాను.

ఈ సంబంధం మా అమ్మమ్మ ఏరి కోరి చేసింది.

మా వారు వో రైతు. కాని గీతలో 'కర్మణ్యే వాధికారస్తే ..." ఆయనకు చాలా బాగా వర్తిస్తుంది. పగలంతా కష్టించి పని చేసి సాయంకాలం గీత పట్టుకుని కూర్చునేవారు.

'అనుద్వేగ కరం వాక్యం సత్యం ప్రియ హితంచయత్
స్వాధ్యాయభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే,
అనే శ్లోకం ఆయనకు బాగా ఇష్టం. ప్రతి రోజూ ఆ శ్లోకం తోనే గీత ప్రారంభించేవారు.

భగవద్గీత ఏ చాదస్తులో లేక అకర్మణ్యులో మాత్రమే చదువుకుంటారనేది పొరపాటు. అక్షర ప్రత్యక్షరం మన జీవితంలో రూపొందించ వచ్చును. సత్యాగ్రహ సందేశం గీత నుండే పొందానని గాంధి మహాత్ముడు అనేకసార్లు ఉద్ఘాటించాడు.

గీతలో ప్రతి శ్లోకం ఒక మహాకావ్య మనేవారు మా వారు.

ధర్మమార్గావలంబనం సహృదయ లక్షణం. ధర్మగ్లాని కలిగించిన వాడు సమూలంగా నాశనమవుతాడు. అతని హృదయం తీరని క్షోభకు గురై మానసిక యాతనకు లోనవుతాడు. అందుకే కురుక్షేత్ర సంగ్రామ ప్రారంభంలో ధర్మచ్యుతుడైన ధృతరాష్ట్రుడు—'ధర్మక్షేత్రే కురుక్షేత్రే... అంటూ కలవర పడతాడు."

మధ్యాహ్నం అయింది.

"నిన్ను విసిగిస్తున్నానేమో, నాయనా! భోజనం చేశాక చెప్పుకుందాములే! అయినా చెప్పవలసింది మాత్రం ఏముంది?" అంది అమ్మ మధ్యలో ఆపి.

నా శరీరంలో ఏదో వినూత్న చైతన్యం ఆవహించినట్టుంది.

"వద్దు! ఆపొద్దు! చెప్పమ్మా! ఆపకుండా కానియ్" అన్నాను.

అమ్మ చెప్పుకు పోతోంది—

"పెళ్ళయ్యాక ఏడెనిమిది సంవత్సరాలవరకు మాకు సంతానం కలగలేదు. కొన్ని తీర్థాలు సేవిద్దామనిపించింది. బయలుదేరి చాలా పుణ్యక్షేత్రాలు దర్శించుకున్నాము.

నాగపూర్‌కు ఈశాన్య దిశలో యాభయి కిలోమీటర్ల దూరంలో 'రామ్ టేక్' అనే పుణ్యక్షేత్రం నాకు చాలా బాగా నచ్చింది. దానినే 'రామగిరి' అని కూడా అంటారు. అగస్త్యాశ్రమం అదేనని అక్కడి స్థల పురాణం చెబుతుంది. హాయి గొలిపే ప్రకృతి సహజ వాతావరణం. కొండల మధ్య వో సరోవరం ఉంది. శ్రీరాముడు వనవాస సమయంలో అక్కడకు వేంచేశాడని అంటారు. దండకారణ్యం అక్కడనుండే ప్రారంభం. శ్రీరాముడు రాక్షస సంహారం గావించి, మహర్షులకు తపోభంగం కలగకుండా ప్రతిజ్ఞ చేసి దక్షిణాభిముఖంగా బయలుదేరుతాడు.

ఇప్పు డక్కడ కొండపై సీతారామ మందిరం ఉంది. దానికి తూర్పున లక్ష్మణస్వామి దేవాలయం ఉంది. మహాకవి కాళిదాసు మేఘ సందేశ కావ్య మల్లిన స్థానమదే! అక్కడి రమణీయ ప్రకృతి గాంచిన రసజ్ఞులకు—

'యక్షశ్చక్రే జనక తనయా స్నాన పుణ్యోదకేషు
స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతిం రామగిర్యాశ్రమేషు'
అనే శ్లోకం తప్పక స్ఫురిస్తుంది.

తీర్థయాత్రలు ముగించి ఇల్లు చేరాం. నా కడుపు పండింది. పండంటి బిడ్డను కన్నాను. నా మదిలో 'రామగిరి' మెదిలింది. 'సీతారాముడ'ని పేరు పెట్టాను. కాని బాబును 'సీతా!' అంటూ ముద్దుగా పిల్చేవారం."

'అమ్మ' చెప్పే మాటలు నా కెందుకో గగుర్పాటును కలిగిస్తున్నాయి. అచ్చంగా నా పేరే! 'భావ సమైక్యత అంటే ఇదేనేమో!' అనుకున్నాను.

'అమ్మ' ఆపకుండా చెపుతోంది.

"బాబుకు పదేళ్ళు వచ్చాయి. అయిదో క్లాసు చదువుతున్నాడు.

బందరు, దివి సీమలు ఎక్కువగా తుఫానుకు గురి అవుతుంటాయి. నేను పుట్టిన సంవత్సరం బందరులో పెను తుఫాను వచ్చి ముప్పయి అయిదు వేల మంది సముద్రం పాలయ్యారట. ఆ నాడు బతికున్న వారికంటె చనిపోయిన వారే ఎక్కువ. అంత్యక్రియలు చేసే దిక్కులేక ప్రభుత్వం వారు శవాలను గుట్టగా చేర్చి మట్టి పోయించారు. ఈ నాటికీ బందరులో అలాంటి దిబ్బలు కొల్లలుగా కానవస్తాయి.

మా వారు అంటుండేవారు — 'సముద్రం మన తల్లి. అందులోనే పుట్టాం. ఏనాటికైనా అందులోనే కలిసిపోతాం' అని.

అది 1969 వ సంవత్సరం. మే నెల. ఎండలు మండే కాలం అది. కాని కడలి పొంగింది. కొబ్బరి తోటకు వెళ్ళిన మా వారు, పాలేరు లక్ష్మయ్య శ్రీఫలాలను కడలి తల్లికి కానుకగా తీసుకుపోయి ఆ అనంత జలరాశి కౌగిలిలో లీనమై పోయారు. నా పసుపు కుంకుమ కృష్ణవేణికి అర్పించుకున్నాను."

అమ్మ తొణక్కుండా చెప్పసాగింది. నాకు ఒళ్ళు జలదరిస్తోంది. ఆసక్తిగా వింటున్నాను.

"సంతానం తల్లితండ్రుల ప్రతిరూపం అంటారు. మా సీతలో మా వారిని చూసుకుంటూ కాలం గడపసాగాను. వాల్మీకి అంటాడు — 'కాలోహి దురతిక్రమః'. ఎంతటి వాడు కూడా కాలానికి దాసుడు కావలసిందే!

చావు అనేది ప్రకృతి లక్షణం. చెట్టునుండి కాయ రాలటానికి కారణాలు అనేకం— తుఫాను, రాయి, పరిపక్వత మున్నగునవి. కాని ప్రతి మానవుడు నిశ్చింతగా ప్రాణాలు వదలాలని ఆశిస్తూ —

'ఉర్వారుక మివ బంధనాత్
మృత్యోర్ముక్షీయ మామృతాత్' అని దేవుని కోరుకుంటాడు. కాని ఎంతటి వారు కూడా విధిని ఎదిరించలేరు.

కాలం గడుస్తున్న కొలది నే నెందుకో అచేతనంగా ఉండసాగాను. కొన్ని సంవత్సరాలు గడిచాయి. పిల్లవాడు చదువు మాని వ్యవసాయం చేస్తున్నాడు.

మా బంధువుల అమ్మాయి పెండ్లి వచ్చింది. చల్లపల్లిలో ఇచ్చారు. వివాహ వేదిక ఏడుకొండలపై అన్నారు.

"నువ్వు వెళ్ళి రా, అమ్మా! నేను ఇంటి దగ్గర ఉంటాను" అన్నాడు మా సీత!

సరేనని పెళ్ళి వారితో వెళ్ళాను. దేవుడు భక్తుల్ని అడుగడుగునా పరీక్షిస్తుంటాడు. నా జీవితంలో అది అక్షర ప్రత్యక్షరం సత్యం.

అది 1977 వ సంవత్సరం నవంబరు నెల. ఇప్పటికి ఏడేళ్ళు గడిచాయి. జల నిధిలో బడబాగ్ని ప్రజ్వరిల్లింది. వూరి జనమంతా ప్రాణాలు దక్కించుకోటానికి మా మిద్దెపైకి వచ్చారు. మా సీత అందరికీ చేయి ఇచ్చి పైకి లాగాడు. వీధులన్నీ నిలువెత్తు అలలతో అల్లాల్లాడి పోతున్నాయి.

క్రింద నుండి 'అంబా' అన్న కేక మా సీత చెవిలో పడింది.

"అరె! ఆవు మెడ తాడును విప్పటం మరిచి పోయానే!" అన్నాడు. ఎందరు వారించినా ఎవరో పిలుస్తున్నట్లు పరుగున వెళ్ళాడు.

మిద్దెపై జనం నిశ్చేష్టులై చూస్తున్నారు. సీత ఆవును విప్పాడు. మిద్దెపై జనం 'అమ్మయ్య' అనుకున్నారు.

ఇంతలో తాటిచెట్టంత అల వచ్చింది. ఆవు గంగడోలును సీత గట్టిగా కౌగలించుకున్నాడు. ఇద్దరూ సుడులు తిరుక్కుంటూ అలలలో లీనమై సముద్ర గర్భంలో కలిసిపోయారు."

'అమ్మ' ఓ క్షణం మౌనం వహించింది. నా కళ్ళనుండి నీళ్ళు కారుతున్నాయి. 'అమ్మ' నా వైపు చూడటం లేదు. ఎక్కడో శూన్యంలోకి చూస్తోంది.

"తుఫాను తగ్గిన వారం రోజులకు గాని నేను తిరిగి రాలేదు. అప్పుడు మొత్తం పాతిక వేలమంది అనంత జలరాశిలో కలిసిపోయారు. శవం లేని కుటుంబం లేదు. కొన్ని కుటుంబాలలో ఒక్కరు కూడా మిగలలేదు.

ఎవరు ఎవరిని పోగొట్టుకొన్నారో తెలియలేదు. ఎందరో పిచ్చివాళ్ళయి పోయారు. అనేకులకు మాట పడి పోయింది. రుద్రుని ప్రళయ తాండవ మంటే అదే నేమో!

నా కెందుకో అక్కడ ఉండ మనస్కరించలేదు. కారణం చెప్పలేను. ఎప్పుడు, ఎవరు, ఎక్కడ ఎందుకుంటారో నిర్ణయించటం అంత సులభం కాదు. అది జీవ లక్షణం. అంతే!

ఆ తర్వాత ఇక్కడకు చేరాను. కొందరు తమ వ్యథను విశ్వబాధగా చేస్తారు. కాని విశ్వబాధను తన బాధగా చేసుకొని నలుగురికి సహాయపడటం సత్య లక్షణం. నలుగురి సుఖంలో నేను ఆనందం పొందటం అమృత తత్త్వ మనుకున్నాను. చైతన్యమూర్తులైన అనేక మంది పిల్లలకు ఇక్కడ 'అమ్మ'గా ఉంటూ, అందరిలో నా 'సీత'ను చూసుకుంటూ కాలం గడుపుతున్నాను.

సంవత్సరానికి నా పొలం మీద కొన్ని వేల రూపాయలు ఆదాయం వస్తుంది. ఎన్నో గుప్త దానాలు చేస్తాను. కుడి చేతి దానం ఎడమ చేతికి తెలియకూడ దంటారు. నా జీవితంలో దానినే అనుసరిస్తున్నాను.

ఇప్పటికి కొన్ని వందల మంది విద్యార్థులను పోషించే భాగ్యం కలిగింది. వారందరిలో నా 'సీత' ఉన్నా డనుకుంటాను.

"ఏమిటి, సీతా, ఏడుస్తున్నావా?" అంది తన కథ చెప్పటం ముగించిన 'అమ్మ'.

ఉలిక్కిపడి కళ్ళు తుడుచుకున్నాను.

మధ్యాహ్నం రెండు గంట లయింది. ఇద్దరం భోజనం చేశాం.

అయిదు గంట లయ్యేసరికి సామాను రిక్షాలో పెట్టి 'అమ్మ' కాళ్ళకు నమస్కరించాను.

కాగితంలో చుట్టిన ఒక పొట్లాం నా చేతిలో పెడుతూ "దీంట్లో పులిహోర, పెరుగన్నం విడి విడిగా ఉంది. రెండూ కలిపి చుట్టాను. దారిలో తిను" అంది.

నా కన్నీళ్ళు ఆమె పాదాలను అభిషేకం చేస్తున్నాయి. అది బాధతో కాదు—అవి ఆనందాశ్రువులూ కాదు! ఏమిటో చెప్పలేని, నాకే అర్థంకాని ఒక అలౌకికమైన అనుభూతి అది.

తెల్లవారి అయిదు గంటలకు రైలు దిగి ఆంధ్రా యూనివర్సిటీ సిద్ధార్థ బ్లాకులో చేరాను.

తూర్పున కిటికీలోనుండి అనంత జలరాశి కాన వస్తోంది. 'రేపటి నుండి ఈ సముద్ర శాస్త్రమే చదవాలి కదా!' అనుకున్నాను.

క్షితిజం నుండి ఉషఃకాంతులు ఆకాశంలోకి చొచ్చుకొని తారలను కనుమరుగు చేస్తున్నాయి.

శివ వాల్తేరు గుడి నుండి—

'నమో హిరణ్య బాహవే

సేనాన్యే దిశాంచ పతయే నమో' అని రుద్ర నమకం వినవస్తోంది.

ప్రశాంత సాగర దృశ్యాన్నే ఆస్వాదిస్తూ నిల్చున్నాను. ఉషఃకాంతుల మధ్య బాలభానుడు హిరణ్య వర్ణంతో జలనిధి నుండి అమృత కలశంలాగా దివ్య కాంతు లీనుతూ దర్శన మిచ్చాడు.


అలాగే చూస్తూ నిల్చున్నాను.

సముద్రం మధ్య బాలభానుడిలో దివ్యస్మిత వదనంతో కన్పించింది 'అమ్మ'. ★

## కట్నం కథలు

( రచన: శ్రీ కాలువ మల్లయ్య, ప్రతులకు: రచయిత, బి—64, ఫెర్టిలైజర్ సిటీ, కరీంనగర్ జిల్లా, 505210, వెల రు. 8—00 )

**సామాజిక** రుగ్మతలను గుర్తించి, వాటిని పట్టించుకొని తన రచనలలో వాటిని చిత్రించి సమాజానికీ, వ్యక్తులకూ తన సందేశాన్ని ఇచ్చినందుకు ఈ రచయితను అభినందించవలసి ఉన్నది. సాధారణంగా సామాజిక దృక్పథమంటే ఆర్థిక విషయాలేనే భావన సోషలిస్టు వాస్తవికత అనబడే రచనల ప్రభావం వల్ల ఏర్పడి పోయింది. కాని—వరకట్నాలు,అవినీతి, ఆశ్రితపక్షపాతం, కులాభిమానం, ముఖ్యంగా నేడు సమాజంలో ప్రతి విషయానికీ కులతత్వం ముందుకు వచ్చి మంచి చెడులనూ, శక్తి సామర్థ్యాలనూ పక్కకి నెట్టడం వల్ల మన సమాజం ఎటువంటి దురవస్థకు చేరుకోనున్నదో రచయితలు గుర్తించి వాటి నిర్మూలనను దృష్టిలో పెట్టుకుని రచనలు చేయవలసిన అగత్యం ఉన్నది. ఈ రచయిత ముఖ్యంగా వరకట్న దురాచారాన్ని గూర్చి తమ కథలలో చాలా శక్తివంతంగా చిత్రించి, "యువకులారా, కట్నం కొరకు వ్యక్తిత్వాలను చంపుకుని పశువుల్లాగా అమ్ముడు పోకండి" అని హెచ్చరిక చేశారు. ఇంకా అనేక ఇతర ప్రశ్నలనుకూడా రచయిత ఈ కథలలో స్పృశించారు. వాటికి వెంటనే సమాధానాలు లభించక పోవచ్చుగాక కాని, అవి సాహిత్యంలో చర్చింప బడటం వల్ల ఒక చైతన్యం కలిగి వ్యక్తులను ఆలోచింప జేస్తాయి.




## కుమ్మరి మొల్ల

( రంగస్థల నాటకము. రచయిత: శ్రీ బి. యస్. యల్. ఆచార్య. ప్రతులకు: వేదము వేంకటరాయ శాస్త్రి అండ్ బ్రదర్స్, 3 మల్లికేశ్వర గుడి సందు, మద్రాసు—600 001. వెల: రూ. 10—00.)

**మొల్ల** రామాయణాన్ని మాత్రమే చదివిన వారు ఆమె మంచి కవయిత్రి అనీ, భక్తురాలనీ అనుకుంటారు. ఇంటూరి వెంకటేశ్వరరావు గారు వ్రాసిన 'కుమ్మరి మొల్ల' నవలను చదివిన వారు ఈమె చరిత్ర చాలా ఉందే అని ఆశ్చర్య పోయారు. ఆ నవల ఆధారంగా రాసిన ఈ నాటకాన్ని చదివినా లేక దీని ప్రదర్శనను చూచినా ఈమె చరిత్రలో నాటకీయ ఘట్టాలు ఉన్నాయని గ్రహిస్తారు. 15 రంగాలతో అత్యంతము ప్రదర్శన యోగ్యమైన నాటకంగా రచయిత దీనిని రచించారు.

ఆ నాటి చారిత్రక వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కల్పనా చాతుర్యంతో, వూహా పటిమతో శ్రీ వైష్ణవము, వీరశైవము, శ్రీరాముడు, శ్రీకంఠ మల్లేశ్వరుడు, సంస్కృత భూయిష్ఠ భాష, జాను తెలుగు, మార్గ కవిత, దేశికవిత, కులతత్వం, ధనిక తత్వం, వర్గ ద్వేషాలు, స్వార్థాలు, దవుర్జన్యాలు ఈ మొదలైన వాటి నన్నిటినీ సూక్ష్మంగా చూపుతూ, ఆ నాటి సంఘంలోని సంఘర్షణను